క్లుప్తంగా

మలేరియా నివారణ కార్యక్రమాలు చేపట్టాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మలేరియా నివారణకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్స్(మేల్)కు రెండురోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయితో పర్యటించి జ్వర పీడితుల రక్తపూతలను సేకరించాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారి వై.మణి, డి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

విజయనగరం రూరల్: మండలంలోని చెల్లూరు గ్రామ సచివాలయాన్ని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వైవీ రమణ సోమవారం సందర్శించారు. సచివాలయం పరిధిలో నిర్వహించిన పశుబీమా, వాక్సినేషన్, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వెటర్నరీ అసిస్టెంట్ ఎం.వనజను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పి.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక మయూరీ కూడలి వద్ద ఉన్న నాగోజీపేటలో సంపత్ ఆంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెలవలపల్లి కృష్ణ గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గణపతి పూజ, సీతారామ విశిష్ట పూజలు, కలశ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ఇసరపు శేఖర్ నేతృత్వంలో తమలపాకులు, అరటిపండ్లతో నివేదన చేశారు. సంపత్ ఆంజనేయస్వామి వారి హోమం చేశారు. నాగోజీపేట యూత్ సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 5వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

భోగాపురం: అక్రమంగా మద్యం అముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని గూడెపువలస గ్రామానికి చెందిన కొండపు రామునాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. అతని వద్ద 90 మద్యం బాటిళ్లు, 12 బీరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

• ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా

విజయనగరం పూల్‌బాగ్: ఢిల్లీలో జరిగిన రైతు పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించిన మోదీ.. రైతులకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయకపోవటం వల్లే అన్నదాతలు మళ్లీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటిస్తూ చట్టాన్ని తీసుకురాకపోవడంతోనే రైతులు తిరిగి ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా చేసేందుకు ప్రయతిస్తోందని మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శంకరరావు, రెడ్డి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

24న అష్టావధాన సాహితీ సవనం

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24న సాయంత్రం 6 గంటలకు మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల వేదికగా రాజమండ్రికి చెందిన శతవధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అష్టావధాన సాహితీ సవనం నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు సోమవారం తెలిపారు. కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జి.జనార్దనాయుడు, రామనారాయణం ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రాశ్నిక పరిషత్‌లో డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, డాక్టర్ జి.శిరీషా రఘురామ్, దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎస్.హరిచందన్, సరిపల్లి సోమేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్, దశగ్రంథాల వెంకటప్రసాద్, భోగరాజు ఖాదరవలీ బాబూజీలు పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



సీహెచ్ అగ్రహారంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
• సీహెచ్ అగ్రహారంలో హుషారుగా ఎన్నికల ప్రచారం

పూసపాటిరేగ: ఐదేళ్లలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. మండలంలోని సీహెచ్ అగ్రహారం, ఎగువపోరాం, దిగువపోరాం గ్రామాల్లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. పేదల సంక్షేమం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో 1.20 కోట్ల మందికి సంక్షేమ పథకాల రూపంలో రూ.3.70 లక్షల కోట్లు అందజేశారన్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించినట్లు చెప్పారు. డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చేయకుండా చంద్రబాబు మోసం చేస్తే.. సీఎం జగన్ రుణాలు మాఫీ చేసి డ్వాక్రా సంఘాలను ఆదుకున్నారన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం చింతపల్లిలో మత్స్యకారులకు ఫ్లోటింగ్ జెట్టీ, భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, కుమిలిలో రామతీర్థసాగర్ రిజర్వాయిర్‌తో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ నేతలు మాయమాటలతో ప్రజల వద్దకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వారిని తిప్పికొట్టాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శతశాతం అమలు చేశారని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందించిన జగనన్నను మీ ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, కొత్తకోట శ్రీరాములు, గుడివాడ శ్రీనివాసరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, బర్రి చినఅప్పన్న, గుజ్జు సురేస్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కోట్ల రఘు, మహంతి లక్ష్మణరావు, పి.నారాయణరావు, ఎడ్ల రామకృష్ణ, శాంతాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోబెల్స్ ప్రచారంలో టీడీపీ నేతలు ఆరితేరిపోయారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• కుటుంబ సభ్యులకు కండువాలు వేసి పార్టీలో చేరినట్లు ప్రచారం
• టీడీపీ నేతల తీరుపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు

విజయనగరం రూరల్: గోబెల్స్ ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దిట్టని, ఆయన వారసత్వాన్నే ఆపార్టీ నేతలు కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు దుయ్యబట్టారు. మండలంలోని ముడిదాం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు వారి కుటుంబ సభ్యులకు పార్టీ కండువాలు వేసి కొత్తగా పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. టీడీపీ మైండ్‌గేమ్ రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, పచ్చ పత్రికలు వాస్తవాలు తెలుసుకుని ప్రచురించాలన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని భారీ మేజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

అవినీతిపై చర్చకు సిద్ధమా..

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అతిధి గజపతిరాజు ప్రచారంలో అవినీతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు కార్యక్రమంలో కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడింది మీ పార్టీ నాయకులేనని, జన్మభూమి కమిటీలు ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను మింగేశారని, ఉపాధి నిధులను దోచేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరాయన్నారు. దమ్ముంటే అవినీతిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లగుడు శివాజీ, ఎస్.సత్తిరాజు, కొసన సన్నిబాబు, కరుమజ్జి రాములప్పుడు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ విద్యార్థికి అభినందన



రాకేష్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ సీతారామరాజు, ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు

డెంకాడ: స్థానిక ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చివరి సంవత్సరం చదువుతున్న అందవరపు రాకేష్ గేట్-2024 ఫలితాల్లో ఆల్ ఇండియా 11వ ర్యాంకు సాధించడంతో కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, అధ్యాపకులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు మాట్లాడుతూ.. ఐఐటీ, ఎన్ఐటీలలో పీజీ అడ్మిషన్, పీఎస్‌యూలో ఉద్యోగం పొందేందుకు ఏటా గేట్ నిర్వహిస్తారన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష రాస్తారని, దీనిలో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి రాకేష్ ఆల్ ఇండియా స్థాయిలో 11వ ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, ఈసీఈ హెచ్‌ఓడీ ఎస్‌కే మస్తాన్ వలీ, తదితరులు పాల్గొన్నారు.

• ప్రగతి మంత్రం



ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం నియోజకవర్గం ప్రగతికి అవిశ్రాంతంగా కృషిచేసిన వారిలో ముందువరుసలో ఉన్న వ్యక్తి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి. ఐదేళ్లలో నగర రూపురేఖలనే మార్చేశారన్నది జనంమాట. ప్రతీ చెరువుగట్టు ఓ పార్కుగా, ప్రతీ కూడలి ఆహ్లాదకరంగా.. నగర వాసులు సేదతీరేందుకు వీలుగా పర్యాటకంగా నగరాన్ని అభివృద్ధి చేశారు. శివారు కాలనీలకు రోడ్లు, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపారు. మండలంలోని పలు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్న నేతగా గుర్తింపు పొందారు. అందుకే.. ఆయన విజయం సునాయాసమన్న మాట ప్రతిచోట వినిపిస్తోంది.

నియోజకవర్గం: విజయనగరం
పేరు: కోలగట్ల వీరభద్రస్వామి
పార్టీ: వైఎస్సార్‌సీపీ
హోదా: విజయనగరం ఎమ్మెల్యే, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్
వృత్తి: వ్యాపారం

కుటుంబ వివరాలు:

భార్య: కోలగట్ల వెంకటరమణి (రెండుసార్లు విజయనగరం మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు). పెద్ద కుమార్తె కోలగట్ల సంధ్య ఎంబీబీఎస్ విద్యనభ్యసించి జనరల్ ఫిజీషియన్‌గా విదేశాల్లో నివసిస్తున్నారు. చిన్న కుమార్తె కోలగట్లశ్రావణి విజయనగం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రాజకీయ నేపథ్యం..

సామాన్య కార్యకర్త స్థాయి నుంచి కోలుగట్ల వీరభద్ర స్వామి నేడు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ స్థాయికి ఎదిగారు. 1983 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1985 సంవత్సరంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 1987లో విజయనగరం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నిక కాగా 1989లో కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులయ్యారు. 1989, 94, 99 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున విజయనగరం శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీచేసిన కోలగట్ల వీరభద్రస్వామి.. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి పూసపాటి అశోక్ గజపతిరాజుపై విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 2013 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా పదవి దక్కించుకున్న ఆయన 2014లో ఆ పదవికి, ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా నియమితులయ్యారు. అనంతరం 2019 ఎన్నికల్లో మొదటిసారిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజుపై విజయం సాధించారు.

చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు:..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాలకు లక్షలాది రూపాయలను విరాళంగా అందజేశారు. నగరంలోని సిటీ బస్టాండ్ ప్రాంతంలో గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ భవనాన్ని తొలగించి సొంత నిధులతో కొత్త భవనం నిర్మించారు. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ప్రధాన రహదారుల విస్తరణ, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి.. నగర ప్రజలకు తాగునీటి అందించడంలో భాగంగా 11 వాటర్ ట్యాంకుల నిర్మాణం, ప్రధాన జంక్షన్లలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు, నగరంలోని ప్రధాన చెరువులు అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులు చేపట్టారు. నిరుపేదల ఆకలిని తీర్చడంలో భాగంగా నగరంలోని ఆరు ప్రధాన జంక్షన్లలో ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారు.

• నిత్య కృషీవలుడు



బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు నిత్యకృషీవలుడిగా మంచి పేరుంది. నియోజకవర్గాన్ని దేశంలోనే ముందువరుసలో నిలపడంలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. రామతీర్థం పుణ్యక్షేత్ర అభివృద్ధిలో భాగస్వామిగా, భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ అందరి మన్ననలు అందుకున్నారు. ప్రభుత్వ సంక్షే, అభివృద్ధి మంత్రం ఆయనకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయమంత్రం కానుందని రాజకీయవేత్తలు చెబుతున్నారు.

పేరు: బడ్డుకొండ అప్పలనాయుడు
పార్టీ: వైఎస్సార్‌సీపీ
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే
విద్యార్హతలు: బీఏ
పుట్టిన తేది: 19-09-1971
తల్లిదండ్రులు: సత్యనారాయణ, పార్వతమ్మ

కుటుంబ వివరాలు:

భార్య: బడ్డుకొండ పద్మావతి
పెద్ద కుమారుడు: మణిదీప్‌నాయుడు
పెద్దకోడలు: స్నేహ
చిన్నకుమారుడు: ప్రదీప్ నాయుడు
చిన్న కోడలు: సిరిసహస్ర

రాజకీయ నేపథ్యం: 1995లో మోపాడ సర్పంచ్. అనంతరం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడిగా, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2007లో జిల్లా పరిషత్ చైర్మన్.. 2009, 2019లో నెల్లిమర్ల ఎమ్మెల్యే, శాసనసభ అంచనా కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

ప్రగతి మంత్రం: ఎమ్మెల్యేగా నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తూ... దేశంలోనే నియోజకవర్గానికి పేరుతెచ్చే పనులు చేపట్టారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థంలోని బోడికొండపై సుమారు రూ.3కోట్ల వ్యయంతో కోదండరామాలయం నిర్మాణానికి తనవంతు కృషిచేశారు. ప్రధానాలయమంలో మరో రూ.కోటి వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణంలో తనదైన భూమిక పోషించారు. రామతీర్థ సాగర్ ప్రాజెక్టు మిగులు పనుల పూర్తికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో తనదైన ముద్ర వేశారు.


కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భోగాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా విద్యార్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద విద్యార్థినులు, అనాథ బాలికలకు ప్రవేశాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

నెల్లిమర్ల: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియో థెరపీ చేయించడం ద్వారా వైకల్యాన్ని క్రమంగా అధిగమించవచ్చని డాక్టర్ కె.రాజ్‌మోహన్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకల్యం తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు వెంటనే మేల్కొని ఫిజియోథెరపీ చేయిస్తే ఆశించిన ఫలితం కనిపిస్తుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల వైకల్యంపై అవగాహన కల్పించుకుని ప్రాథమిక స్థాయి నుంచే ఫిజియోథెరపీ చేయించాలని కోరారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన



పిల్లలకు బొమ్మలు చూపిస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ప్రీ స్కూల్ మెటీరియల్‌తో పాటు కాగితాలు, కొబ్బరి పీసు, అట్టలు, పూసలు, చెక్కలతో వివిధ రకాల బొమ్మలు చేసి వాటి సాయంతో పిల్లలకు బోధన చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్ప, లక్ష్మి సాయికుమారి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



ముక్కాంలో ప్రచార పత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు

భోగాపురం: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ముక్కాం, రామచంద్రపేట, ముంజేరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఫొటోలతో ఉన్న స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. ఎవరి సిఫార్సు లేకుండానే అర్హులకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బైరెడ్డి యర్రప్పలనారాయణ, వాసుపల్లి రేయ్యుడు, పూడిక నూకరాజు, కోరాడ చిన్నరావు, ఎం.నరసింహులు, పిడుగు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు టాటాస్టీల్ సహకారం



టాటా స్టీల్ ప్రతినిధులను సత్కరిస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రముఖ గ్లోబల్ స్టీల్ కంపెనీతో వ్యూహాత్మక సహకారాన్ని ఏర్పరచుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టాటా స్టీల్ ప్రతినిధులతో ఈ మేరకు ఒప్పంద చేసుకున్నామన్నారు. టాటా స్టీల్ జోనల్ హెడ్ (టెక్నాలజీ) ఎం.సూర్యనారాయణతో కూడిన ప్రతినిధుల బృందం మనీష్ కుమార్, కె.రమ్య, హెచ్.హరిహరపుతిరన్, కె.దినేష్, కళాశాల ప్రాంగణాన్ని సందర్శించారు. సమకాలీన సివిల్ ఇంజినీరింగ్, నిర్మాణ సామాగ్రిపై వర్క్‌షాప్ నిర్వహించేందుకు జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) సహకారంతో సీతంలోని వివిధ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా టాటా స్టీల్ జోనల్ హెడ్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. టాటా స్టీల్ ఇంజినీరింగ్ రంగంలో ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి కళాశాల విద్యార్థులకు సహకారం అందిస్తుందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్య ప్రతినిధులు టాటా స్టీల్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఎన్ఎస్ఎస్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్

విజయనగరం అర్బన్: వయోజనులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా ప్రజల్లో అవగాహక కలిగించేలా యువత బాధ్యత తీసుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అన్నారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం సోమవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు హక్కు విలువను తెలియజేయాలని సూచించారు. దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన ఉన్నప్పుడే శతశాతం ఓటింగ్ లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీఓ డాక్టర్ బొత్స ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.మణికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

విజయనగరం పూల్‌బాగ్: గంట్యాడ మండలంలోని లక్కిడాం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లక్కిడాం గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ, డ్వామా అధికారులను పలుమార్లు కోరినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు కల్పించాలని కోరారు.

మోపాడలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

డెంకాడ: గ్రామాల్లో పర్యటించి గ్రామాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం, ప్రజలను చైతన్యవంతులను చేయడమే ఎన్ఎస్ఎస్ శిబిరాల ముఖ్య ఉద్దేశమని రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బీఎస్ వెంకటరెడ్డి, ఎన్ఎస్ఎస్ వింగ్స్(ఆర్ఈసీ) పి.రాజేష్ అన్నారు. మోపాడలో సోమవారం ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. వారం రోజుల పాటు ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బాల్య వివాహాలు, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రఘు ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కలిదిండి రఘు, డైరెక్టర్ రాహుల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.